క్లుప్తంగా

తాగునీటి వనరుల క్లోరినేషన్



కొవ్వూరులో ట్యాంకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

రోలుగుంట: మండలంలో తాగునీటి వనరుల క్లోరినేషన్ చేపట్టినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు తెలిపారు. దీనిలో భాగంగా శనివారం ఆయన కొవ్వూరు, కె.నాయుడుపాలెం గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి క్లోరినేషన్ ఎంత మోతాదులో ఎలా వినియోగించాలో సూచనలు చేశారు. గ్రామస్తులు ట్యాంకుల వద్ద, తాగునీటి బోర్ల వద్ద నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు.

మాడుగుల తహసీల్దారు రిలీవ్

మాడుగుల రూరల్: ఈ ఏడాది ఎన్నికలకు ముందు వచ్చిన స్థానిక తహసీల్దారు టి. సత్యనారాయణ తన సొంత జిల్లా శ్రీకాకుళానికి రిలీవ్ అయ్యారు. ఆయన నుంచి డిప్యూటీ తహసీల్దారు కె.లక్ష్మయ్యకు ఇన్‌చార్జి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి నాయకులకు ఈ సందర్భంగా సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

రాయితీపై యూరియా పంపిణీ



రైతులకు యూరియా అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

కె.కోటపాడు: గొండుపాలెం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు 50 శాతం రాయితీపై శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. 24 టన్నులకు సంబంధించి 530 బస్తాల యూరియాను 210 మంది రైతులకు అందించినట్లు రైతు సేవా కేంద్రం వ్యవసాయశాఖ సహాయకుడు సుధీర్ తెలిపారు. రాయితీపై బస్తాను రూ.267లకు అందించామన్నారు. సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, లక్ష్మణరావు, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు వీరే

నర్సీపట్నం: జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ సమక్షంలో ఎస్ఎఫ్ఐ నర్సీపట్నం డివిజన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.జనార్దన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాయుడు, ఉపాధ్యక్షులుగా జ్ఞానేష్, కిరణ, సాయి, దుర్గ, వికాస్, సహాయ కార్యదర్శులుగా మను, భూషణ్, శివ, మోహన్, దుర్గ, సభ్యులుగా చంటి, జై.కృష్ణ, ప్రసాద్, గణేష్, రాము, వరహాలు, రవి, స్వామి, శేఖర్, శ్రీను, లవరాజు, మహేంద్ర, డేవిడ్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రెసిడెంట్ మాట్లాడుతూ నూతన కమిటీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ, సామాజిక చైతన్యాన్ని కల్పించాలన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి

నర్సీపట్నం: మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఆర్.నిఖిల్ వర్మ, పైల యశ్వంత్‌లకు శనివారం ప్రోత్సాహకాలు అందజేశారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో వీరు ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లాలోని గురుకులాలకు ప్రొవిషన్స్ సరఫరా చేసే విశాఖపట్నంకు చెందిన పీవీఆర్ ట్రేడర్స్ అధినేత వెంకటేష్ రూ.5 వేల చొప్పున అందజేశారు. ఉన్నత విద్యలో రాణించాలని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి సూచించారు. ఇద్దరు విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం



ఎ.కోడూరులో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలను వేస్తున్న హెచ్‌ఎం కామేశ్వరరావు



కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా, డాక్టర్ ఖాసిమ్

కె.కోటపాడు: దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని హెచ్‌ఎం కామేశ్వరరావు అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి పురస్కరించుకుని శనివారం ఎ.కోడూరు హైస్కూల్ ఆవరణలో మహనీయుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు జె.అమృతరావు, ఎరుకునాయుడు, కవిత, పైడయ్య, భారతి, పల్లవి, భవాని, రామారావు, అర్జున్, రమేష్, వెంకటరావు, బంగారునాయుడు, పీఎంసీ కమిటీ చైర్మన్ అర్జున, వైస్ చైర్మన్ తర్రా మోహన్‌రావు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగించాలి

మాజీ రాష్ట్రపతి, భారత రత్న అబ్దుల్ కలాం ఆశయాలను నేటి యువత కొనసాగించాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. అయ్యన్న పాఠశాలలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె. ఖాసిమ్ మాట్లాడుతూ శాస్త్రవేత్తగా దేశం గర్వించదగ్గ పరిశోధనలు చేయడంతోపాటు రాష్ట్రపతిగా ఉన్నతమైన సేవలందించి అన్ని వర్గాలకు కలాం చేరువయ్యారని కొనియాడారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి డాక్టరు ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ కొనియాడారు. కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మహనీయుని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మిస్సైల్ ఆఫ్ ఇండియాగా, రాష్ట్రపతిగా కలాం ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. దేశ రక్షణ రంగానికి విశేష సేవలందించిన అబ్దుల్ కలాం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, మండల కార్యదర్శి గంగవంశం సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రమణ

50 పింఛన్లు తగ్గకుండా మ్యాపింగ్



సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: మండలంలో 10,945 పింఛన్లకుగాను గ్రామస్థాయిలో నియమించిన 183 మంది ఉద్యోగులు కనీసం 50 పింఛన్లకు తగ్గకుండా మ్యాపింగ్ చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లో వచ్చే నెల ఒకటిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శత శాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంఈవోలు సత్యనారాయణ, డీపీడీ ప్రసాద్, ఏపీఎం వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అల్లు శ్వేత, హౌసింగ్ ఏఈ నాయుడు, బాలాజీ అప్పారావు పాల్గొన్నారు.

నాతవరం: పింఛన్ల పంపిణీ రెండు రోజుల వ్యవధిలోనే పూర్తి చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం



విద్యార్థులతో కలిసి సంహపంక్తి భోజనం చేస్తున్న సర్పంచ్ విజయ్

నాతవరం: మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం తయారు చేసి పెట్టాలని సర్పంచ్ కోసూరి విజయ్ తెలిపారు. వై.బి.అగ్రహారం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యత కలిగిన భోజనం రుచికరంగా తయారు చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున శుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సంహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్



అప్పన్నపాలెంలో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది



చిన్నయ్యపాలెంలో అవగాహన ర్యాలీ

గొలుగొండ: వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామం అప్పన్నపాలెంలో వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్ పనులు శనివారం నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు కాలువలు, ఇంటి పరిసరాల వద్ద స్ప్రేయింగ్ చేశారు. ఇక్కడ గిరిజనులకు ఆరోగ్య సూత్రాలపై సీహెచ్‌వో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నయ్యపాలెం, ఎర్రవరంలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. చిన్నయ్యపాలెంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు.

వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు

మాడుగుల రూరల్: అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా కె.జె.పురంలో సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షణలో శనివారం తాచేరు రేవు సమీపంలో జేసీబీతో తుప్పలు, డొంకలు తొలగిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, గుమస్తా సాహూ, కంప్యూటర్ ఆపరేటర్ గణేష్ పర్యవేక్షిస్తున్నారు. ఎం. కోటపాడు, సాగరం, కింతలి వల్లాపురం, తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు.



కె.జె.పురం రేవు సమీపంలో పారిశుధ్య పనులు

తల్లి పేరున మొక్క నాటండి



కాశీపురంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 ఉషారాణి



రోలుగుంటలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కె.కోటపాడులో మొక్కలను నాటుతున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఎంఈవోలు



బేతపూడి కేజీబీవీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ భువనమాధురి

కె.కోటపాడు: ప్రతి విద్యార్థి వారి తల్లి పేరున మొక్క నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం ఆయన ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్‌లతో కలిసి మొక్కలు నాటారు. వాతావరణ సమతుల్యతకు మొక్కలను పెంచాలన్నారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు బోకం ఎర్రునాయుడు, మురళీకృష్ణ, సూరెడ్డి శ్రీనివాసరావు, నరేన్, మల్లాది కామేశ్వరరావు, పీఈటీ లక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల ఆవరణల్లో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎకో క్లబ్ టీచర్ ఎం.నాని, హెచ్‌ఎం డి.ఎస్.ఎస్. ప్రసాద్ కార్యక్రమ ఉద్దేశం గురించి వివరించారు. వెలంకాయలపాలెం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం బండారు నానిబాబు, ఉపాధ్యాయుడు బి.చంద్రశేఖర్ 40 ఫల రకాల మొక్కలను నాటించారు.

దేవరాపల్లి: విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంఈవో-2 వి.ఉషారాణి సూచించారు. హెచ్‌ఎం బీపీటీ సుందరి ఆధ్వర్యంలో కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ మిషన్ లైఫ్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఎంఈవో-2 మొక్కలు నాటారు. బేతపూడి కేజీబీవీలో ప్రిన్సిపాల్ భువన మాధురి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. విద్యార్థినులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. సీఆర్పీలు గంగాధర్, రమణ, ఉపాధ్యాయులు కొట్టాన రాంబాబు సుజాత, రామలక్ష్మి, రాము, మాధవి, పూర్ణిమ, సూర్య పాల్గొన్నారు.

నాతవరం: హెచ్‌ఎం టి. శివజ్యోతి ఆధ్వర్యంలో గునుపూడి హైస్కూల్‌లో విద్యార్థుల తల్లులతో 150పైగా మొక్కలు నాటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు మాట్లాడుతూ మొక్కలు నాటించడం ఆనందంగా ఉందన్నారు. సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: శిక్ష సప్తాహ్‌లో భాగంగా అమ్మ పేరుతో మొక్క కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కొత్తపాలెం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమేగాక వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. పోషణ దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రదర్శించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: జన్నవరం పాఠశాల ఆవరణలో ఎంఈవో జయలక్ష్మి మొక్కలు నాటారు. మరి కొన్ని పాఠశాల ఆవరణల్లో ఎంఈవో-2 కె.సింహాచలం, సీఆర్పీ కె.వి.ఎం.నాయుడు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బుచ్చెయ్యపేట: కందిపూడి పాఠశాలలో అమ్మతో మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు వనదేవత అవతారమెత్తి తమ తల్లిదండ్రులతో మొక్కలు నాటించి ఆకట్టుకున్నారు. మొక్కల పెంపకం వల్ల ప్రకృతిలో జరిగే లాభాపేక్ష గురించి ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు అవగాహన కల్పించారు.



చోడవరం రూరల్: జన్నవరం పాఠశాలలో మొక్కను నాటుతున్న ఎంఈవో



మాకవరపాలెం:కొత్తపాలెంలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న ఎంఈవో మూర్తి



గునుపూడిలో విద్యార్థుల తల్లులకు పలు అంశాలపై వివరిస్తున్న హెచ్‌ఎం శివజ్యోతి

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

మాకవరపాలెం ఎంపీపీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. ఆయన అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సమావేశం మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలతోపాటు ప్రస్తుతం అమలవుతున్న రాయితీ పథకాలను సభ్యులకు వివరించారు. అనంతరం అన్‌రాక్ భూ సేకరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు కేటాయించిన కొత్తపాలెం కాలనీలో ఎన్నో అక్రమాలు జరిగాయని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు అధికారులను ప్రశ్నించారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అనర్హులకు ఇచ్చిన స్థలాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు తామరం రెవెన్యూలోని సర్వే నంబర్ 70 నుంచి 78 వరకు ప్రభుత్వ భూమిలో గెడ్డలను కప్పేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసిన అర్హులకు సీట్లు కేటాయించలేదన్నారు. ఈ ఏడాది కేటాయించిన సీట్ల వివరాలు ఇవ్వాలని ఎంఈవో మూర్తిని కోరారు. తాను లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, ఎంపీడీవో చంద్రరావు, డీటీ శంకర్రావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులకు ఎండీటీ మాత్రలు



గుల్లేపల్లిలో వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు: కనురెప్పలు మూతపడిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు వెంబడి రక్తం కారడం వంటి కుష్టు లక్షణాలు ఉంటే ఎండీటీ మాత్రలు ఉచితంగా ఇవ్వనున్నట్లు వైద్యాధికారి తరణి తెలిపారు. శనివారం గుల్లేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటికి వచ్చే సమయంలో కుష్టువ్యాధి నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. శరీరంపై రాగి రంగు మచ్చలు, కనురెప్పలు, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోయే సమస్య ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధి ముందస్తుగా గుర్తిస్తే అంగవైకల్య సమస్య రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎం.ఎల్.హెచ్.పి.పావని, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను పూజించండి



విద్యార్థులకు పుస్తకాలు అందించిన ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: మనకు జీవితాలిచ్చిన తల్లిదండ్రులను దేవతామూర్తులుగా ప్రతి ఒక్కరూ పూజించాలని హెచ్‌ఎం కె. ఉదయభాస్కర్ తెలిపారు. తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయరామరాజుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ వ్యాసరచన పోటీలు నిర్వహించింది. అనంతరం రామాయణం, బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, సుందరకాండ, యుద్ధకాండ, ఉత్తర కాండ, కిష్కంధకాండ పుస్తకాలను హెచ్‌ఎం సమక్షంలో పంపిణీ చేసింది. ఉపాధ్యాయులు చిన సూర్యనారాయణ, రవికుమార్, ముత్యాల నాయుడు, సత్యవేణి, కోటి, పార్వతి పాల్గొన్నారు.

సర్పానదిలో మెడికల్ వ్యర్థాలు



సర్పానది వద్ద వేసిన మెడికల్ వ్యర్థాలు

మాకవరపాలెం: సర్పానదిలో మెడికల్ వ్యర్థాలు వేయడంతో కొండలఅగ్రహారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలో సర్పానదిలో సెలైన్ బాటిళ్లు పెట్టేందుకు వినియోగించే పైపులు, మెడికల్ వ్యర్థాలను వేశారు. వీటి వల్ల దుర్వాసన వెలువడుతోందని సమీప రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లడమేగాక, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాపోతున్నారు. అంతేకాకుండా ఇక్కడి శ్మశాన మార్గం వ్యర్థాలతో నిండిపోయిందని, అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. మరలా వేయకుండా చూడాలని కోరుతున్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



వెంకటాపురం పంచాయతీ కార్యదర్శి మోహినికి వినతి అందజేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

మునగపాక : బకాయిపడిన వేతనాలను విడుదల చేయాలని కోరుతూ వెంకటాపురంలో శనివారం ఉపాధి హామీ పథకం కూలీలు పంచాయతీ కార్యదర్శి మోహిని లక్ష్మికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 9 వారాల పాటు కూలీలకు వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇంతవరకు బకాయిలు ఇవ్వకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 అందజేయాలన్నారు. కార్యక్రమంలో కె.పూర్ణ, సీహెచ్ కుమారి, పి.దుర్గ, ధరణి పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరు నిర్మాణం



చందనాడ దళిత వాడలో బోరు నిర్మిస్తున్న దృశ్యం

నక్కపల్లి : చందనాడ గ్రామంలో దళితులకు చెందిన శ్మశాన వాటికలో బోరు నిర్మాణం చేపట్టారు. ఈ శ్మశానంలో నీటి సదుపాయం లేక పోవడంతో ఈ విషయాన్ని వారు సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు దృష్టికి తీసుకెళ్లడంతో మండల పరిషత్ నిధుల నుంచి బోరు మంజూరు చేయించారు. శనివారం బోరు నిర్మించారు. దీంతో దళితులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ ఎస్ఐగా సావిత్రి

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణ ఎస్ఐగా కె.సావిత్రి శనివారం విధుల్లో చేరారు. ప్రస్తుతం స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్న ఆమెను పట్టణ ఎస్ఐగా నియమించారు. ఇప్పటివరకు పట్టణ ఎస్ఐగా పనిచేసిన కె. పాపినాయుడును వీఆర్‌కు అటాచ్ చేశారు. మరికొన్ని రోజుల్లో ఎస్ఐల సాధారణ బదిలీలు జరగనున్న నేపథ్యంలో అకస్మాత్తుగా ఎస్ఐ పాపినాయుడును వీఆర్‌కు పంపడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా పట్టణ ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న సావిత్రి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారించనున్నట్టు శనివారం రాత్రి సాక్షికి తెలిపారు.

30న ఆలయ భూములకు వేలం

రాంబిల్లి (యలమంచిలి): ధారపాలెం ఉమా ధర్మలింగేశ్వరస్వామి వారి దేవాలయానికి చెందిన 7.12 ఎకరాల భూమిని ఈ నెల 30వతేదీన హరిపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కౌలుకు తీసుకొనుటకు బహిరంగ వేలం ప్రకటన నిర్వహించడం జరుగుతుందని ఈవో టి.సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.